క్లుప్తంగా

ఆటో బోల్తా... భార్య,భర్తలకు గాయాలు

సంజామల: మండల పరిధిలోని రామభద్రుని పల్లె గ్రామ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడి భార్య, భర్తలకు గాయాలయ్యాయి. కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి, దూదేకుల బావమ్మ కూరగాల వ్యాపారం చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. సంజామలలో జరిగే కూరగాయల సంతకు ఆటోలో వెళ్తుండగా రామభద్రునిపల్లె సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. భార్య,భర్తలను 108 వాహనంలో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బోరు ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామ శివారులోని హిందూ శ్మశానవాటిక సమీపంలో బోరు ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. శ్మశానంలో ఖనన సంస్కారాలు పూర్తయ్యాక స్నానాలు చేసేందుకు, కాళ్లు, చేతులు శుభ్ర పరుచుకునేందుకు నీటి వసతి లేకపోవడంతో రూ. 2 లక్షలతో బోరు ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సంఘం సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థినికి నగదును అందిస్తున్న డాక్టర్ దీపిక

డోన్ రూరల్ : పట్టణంలోని కేవీఎస్ ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్ దీపికి ఆదివారం పట్టణానికి చెందిన విద్యార్థిని యమునా నాగేశ్వరమ్మ రూ.15వేలు సాయం చేశారు. తిరుపతిలో బి.ఫార్మసీ చదువుతున్న యమున నాగేశ్వరమ్మకు తనవంతుగా సాయం చేశానని ఈ సందర్భంగా డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, కౌన్సిలర్ పి.సుంకయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ, మహిళా సమైఖ్యా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శభన, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు


విద్యార్థులు, సహచరులతో కిక్కిరిసిన స్కూల్ ప్రాంగణం

డోన్ టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం 825 మంది దరఖాస్తు చేసుకోగా మంది 65మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో ప్రవేశాల కోసం 513 మంది దరఖాస్తు చేసుకోగా 67 మంది గైర్హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ గీత తెలిపారు. ఈ పరీక్షలను దిన్నె దేవరపాడు లెక్చరర్ రాజ్యలక్ష్మీ తనిఖీ చేశారు.

దేవదాయ శాఖ మంత్రిని సత్కరించిన ఈఓ


కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి తాడేపల్లి గూడెంలోని బలసులమ్మ దేవ స్థానంలో జరిగిన వేదాశీర్వచన ఆత్మీయ సభకు హాజరయ్యారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణకు శ్రీ మద్దిలేటి నరసింహస్వామి, అమ్మవార్ల చిత్ర పటాలు అందజేసి, స్వామి వారి ప్రసాదం అందజేసి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో మాఘ మాస అమావాస్య ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి కి పంచామృతాభిషేకం, సింధూర అర్చన,ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు.


బనగానపల్లె : రథం ఎదుట గుమ్మడికాయలతో పూజలు చేస్తున్న దృశ్యం


డోన్: రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా శివపార్వతుల రథోత్సవం

బనగానపల్లె రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామివార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి సంప్రదాయబద్ధంగా ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఆశీనులుగావించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు గుమ్మడికాయలతో ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావడంతో యాగంటి క్షేత్రం కిటకిటలాడింది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ దొనపాటియాగంటిరెడ్డి, ఉమామహేశ్వరస్వామి నిత్యన్నదాన సంస్థ సభ్యులు దస్తగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్వామి,అమ్మవార్ల రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

కనుల పండువగా రామలింగేశ్వరుడి రథోత్సవం

డోన్ టౌన్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల రథోత్సవం అంగరంగా వైభవంగా సాగింది. డోన్ పట్టణ సమీపంలోని కొత్త, పాతబుగ్గలో జరుగుతున్న ఉత్సవాలును భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారువేటలో భాగంగా సాయంత్రం రథానికి బలిహరణ, మంగళహారతి ప్రత్యేక పూజలు నిర్వహించి అత్యంత భక్తి శ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. బుగ్గ తిరునాల సందర్భంగా దుకాణాలు, స్టాల్స్ జనంతతో నిండిపోయాయి. రంగుల రాట్నాలతో కొత్తబుగ్గ ప్రాంతం భక్తులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది.

ఘనంగా ముచ్చట్ల మల్లికార్జునస్వామి రథోత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్‌కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్వామి అమ్మవార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను రథంపై ఆశీనులుగావించి ఆలయ ఆవరణలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె, అంబాపురం తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు రథోత్సవం కార్యక్రమంలో పాల్గొని నందికోల సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు యమసాని జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్లు హుసేన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గ్రూప్ దేవాళాయాల ఈఓ మద్దిలేటి,మాజీ చైర్మన్ గుండా జగన్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల జనార్ధన్, మారం విష్ణు, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ధనుంజయ, ఆర్యవైశ్యులు, భక్తుల ఆధ్వర్యంలో భ్రమరాంభ మల్లికార్జునస్వామికి విశేషపూజలు నిర్వహించారు. భక్తులకు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేళలు ఏఈ వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, గిద్దలూరు, కానాల, ముదిగేడు, ఆర్.లింగందిన్నె, ఎగ్గొని, అక్కంపల్లె తదితర గ్రామాల ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

18 నుంచి ఓపెన్ పబ్లిక్ పరీక్షలు

బేతంచెర్ల: ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూలు 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉంటాయని భాగ్యోదయ హైస్కూలు చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఉంటాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్స్ స్టడీ సెంటర్ నుంచి ఈనెల 14 నుంచి తీసుకోవచ్చని సూచించారు.

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

బనగానపల్లె రూరల్: విప్లవ వీరుడు సర్ధార్ సర్వాయి పాపన్నను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ఫోర్స్‌లైన్స్ సెంటర్‌లో గౌడ(ఈడిగ) సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కుమారుడు, యువనేత కాటసాని ఓబులరెడ్డి, సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం, ఖిలాసాపూర్ గ్రామంలో జన్మించిన సర్ధార్ పాపన్న గౌడ్ చేసిన త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల జెడ్పీటీసీ సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, గౌడ్ సంఘం నాయకులు దేవుడు, తిరుపాల్‌గౌడ్, మోహన్ బాబు, రమణ, వాయు నందనగౌడ్, వెంకటేష్, పెద్దపాపోడు, విజయ్‌గౌడ్, వెంకటరమణగౌడ్, వెంకటేష్‌గౌడ్, కొండయ్యగౌడ్, నరసయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ముగిసిన బండలాగుడు పోటీలు

ప్యాపిలి: స్థానిక కాశీవిశ్వేశ్వరయ్య ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో మొత్తం 12 కాండ్లు పాల్గొనగా పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఓబులదేవరపల్లికి చెందిన ధర్మవరం రమణయ్య వృషభాలు విజేతగా నిలిచి రూ. 20 వేలు కైవసం చేసుకున్నాయి. అదే గ్రామానికి చెందిన చాకలి దోశేఖర్ వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 15 వేలు గెలుపొందాయి. డోన్ మండలం నక్కవాగులపల్లికి చెందిన వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ. 10 వేలు గెలుపొందాయి. వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దినేశ్ రెడ్డి, వేముల రమణ తదితరుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.


విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14వ తేదీ గురువారం నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, యవత సద్వినియోగం చేసుకుని స్థిరపడాలన్నారు. ఈ జాబ్ మేళాకు అశోక్‌లేలాండ్, టాటా ఎలక్ట్రానిక్స్, హెరిటో ల్యాబ్స్, అమెజాన్, డీహెచ్ఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, పేటీఎంతో పాటు పలు బహుళార్థక కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేందుకు స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, గొల్ల వెంకట్రాముడు, మిట్టా ఉమామహేశ్వరి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాజేష్

నెరవేరిన ఏళ్లనాటి కల!


- మంత్రి బుగ్గన చొరవతో రూ. 70లక్షలతో మసీద్ నిర్మాణం
- ప్రారంభించిన రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం పెద్దలు


మసీద్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి


గ్రామంలో నూతంగా నిర్మించిన మసీద్

డోన్ రూరల్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామం ముస్లింల ఏళ్లనాటి కల తీరింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మసీద్ నిర్మాణానికి రూ. 70 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన మసీద్ నిర్మాణం పూర్తవ్వడంతో ఆదివారం ముస్లిం పెద్దలతో కలిసి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఏళ్లతరబడి నెలకొన్న మసీద్ సమస్య తీరడంతో ముస్లింలు మంత్రి బుగ్గనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గతంలో తమ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఈ సందర్భంగా ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం అధికంగా ఉన్న ఈ గ్రామంలో మసీద్ లేకపోవడంతో పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు ముస్లిం పెద్దలు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రం మీకు మసీద్ తప్పకుండా నిర్మిస్తామని చెప్పేవారు. అధికారంలోకి వచ్చా పట్టించుకొనే వారు కాదు. వారి వైపు కన్నెతి చూసేవాళ్లు లేరు. అనేక సార్లు నాయకుల చుట్టు తిరిగి తిరిగి విసుగు చెందారు. 2019 ఎన్నికల ముందు యు.కొత్తపల్లిలో పర్యటించిన బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డిని ముస్లిం పెద్దలు, అందరూ కలిసి కట్టుగా మసీద్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన బుగ్గన వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే మసీద్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ. 70 లక్షలు మంజూరు చేయించడంతో చేపట్టిన మజీద్ నిర్మాణం పూర్తయ్యింది. దీంతో మంత్రికి ముస్లింలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. క్యార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్ కుమార్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, కోఆప్షన్ నెంబర్ హుసేన్, లద్దగిరి మిన్నెల్ల, ముల్లా రహంతుల్లా, రసూల్, సయ్యద్, ఇమామ్ భాషా, గుంతకంటి మస్తాన్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.


గతంలో ఎవ్వరు పట్టించుకోలేదు...



గత ప్రభుత్వాల పాలనలో నాయకులు ఎవ్వరూ తమ మసీద్ సమస్యను పట్టించుకోలేదు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే మా వద్దకు వచ్చి పోయేవారు తప్పా మసీద్ ఏర్పాటు చేయలేదు. వైఎస్సార్ సీపీ పార్టి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి మసీద్‌ను నిర్మించారు. చాలా సంతోషంగా ఉంది. ఆయన చేసిన మేలు ఎప్పటికి మరచిపోం. మంత్రి బుగ్గనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– లద్దగిరి మిన్నెల, యు.కొత్తపల్లి గ్రామం

మా కల నేరవేర్చారు...



గ్రామంలో మసీద్ నిర్మించుకోవాలని అనేక సంవత్సరాలుగా నెలకొన్న కలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నెరవేర్చారు. చాలా సంతోషంగా ఉంది. ఆయన చేసిన ఈ గొప్ప నిర్మాణాన్ని గ్రామంలో ఉన్న ముస్లింలు ఎవ్వరు మరిచి పోలేరు. మసీద్ చాలా సుందరంగా నిర్మించారు. మంత్రికి మా కృత్జ్ఞతలు తెలుపుతున్నాం.

–ముల్లా రహంతుల్లా , మసీద్ పెద్ద, యు.కొత్తపల్లి గ్రామం

ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదు !

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


రూ.36.21లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : గత టీడీపీ పాలనంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన 600 హామీలో ఏ ఒక్కటి అమలు చేయలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు టీడీపీ లేదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నందవరంలో రూ.36.21లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, గ్రామంలో రూ.55లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే 2024లో జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజల్లోకి వెళ్లీ అడిగే హక్కు.. ధైర్యం వైఎస్సార్‌సీపీ నాయకులకే ఉందన్నారు. గత టీడీపీ పాలనంలో చంద్రబాబు నాయుడు జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అర్హత కలిగిన పేదలకు అందించకుండా వారే, స్వహా చేశారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనంలో గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత కలిగి ప్రతి పేద వారికి కుల, మత,పార్టీలతో సంబంధంలేకుండా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రజాభిమానం పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేమని తెలిసే చంద్రబాబునాయుడు పొత్తులకు వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎన్ని పార్టీలతో కలసి వచ్చిన ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్ రెడ్డి, ఏఈ సాయికృష్ణ, ఈఓఆర్‌డీ శివరామయ్య, శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తులసి రెడ్డి, దశరథరామిరెడ్డి, పీఆర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గణేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, చిన్న వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

12న పంచాగం పుస్తకాల అందజేత

డోన్ టౌన్ : పట్టణ పోలీసు స్టేషన్ ప్రక్కన వెలసిన శ్రీసాంబశివాలయంలో ఈ నెల 12వ తేదీన అర్చక పురోహితులకు పంచాంగముల వితరణ చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె శేషావలిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీముక్తేశ్వర పంచాంగములు డోన్ అర్చక పురోహితులకు కళ్లె గోవర్ధనగిరి వంశస్థుల జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాయంత్రం 5.30గంటలకు స్థానిక శ్రీసాంబశివాలయానికి సంప్రదాయ వస్త్రధారణతో చేరుకోవాలని ఆయన సూచించారు. సమావేశం అనంతరం తేనేటి విందు ఏర్పాటు చేశామని తెలిపారు.

పాఠశాలల్లో జిమ్ పరికరాల ఏర్పాటు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ కంపెనీ సామాజిక బాధ్యత కింద కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, చింతలాయిపల్లె ఉన్నత పాఠశాలల్లో జిమ్ పరికరాల, ఇటిక్యాల డిపెప్ ప్రాథమిక పాఠశాలలో ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులతో రూ.12 లక్షలతో నాలుగు పాఠశాలల్లో జిమ్,ఆట వస్తువులు అందుబాటులోకి తీసుకొచ్చారు.


కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో జిమ్ పరికరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని పెట్నికోట- నాయినపల్లె గ్రామాల మధ్య వెలసిన గుండుమల్లేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. రెండో రోజు యు కేటగిరి విభాగపు పోటీలను జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకుల ఈలలు, కేరింతలు కొడుతూ ఎడ్ల యజమానులను ఉత్సాహపరిచారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం చిలమకూరుకు చెందిన పుట్లూరి సుదర్శన్, వైఎస్సార్ కడప జిల్లా తుడుములదిన్నెకు చెందిన వజ్రా వెంకటసుబ్బయ్య వృషభాలు 20 నిమిషాల వ్యవధిలో అత్యధిక దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా బొందలదిన్నెకు చెందిన జంగం గురులోహిత్, రేగడ కొత్తూరుకు చెందిన భూమిరెడ్డి గౌతంరెడ్డి వృషభాలు రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా బేస్తవారిపల్లెకు చెందిన జతిన్ విహాన్ వృషభాలు మూడవ స్థానంలో, నంద్యాల జిల్లా వడ్ల రామాపురానికి చెందిన సుగులూరి లలిత్ కుమార్ వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచాయి. రామ్‌కో సిమెంట్ సహకారంతో ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.30వేలు, రూ.10వేలు చొప్పున జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంగటి వెంకట్రామిరెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


బండను లాగుతున్న మొదటి బహుమతి సాధించిన వృషభాలు

భక్తిశ్రద్ధలతో నూర్‌షావలి ఉరుసు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జుర్రేటివాగు ఒడ్డున వెలసిన నూర్‌షావలిదర్గాలో ఆదివారం ఉరుసు వైభవంగా జరిగింది. మత సామరస్యానికి ప్రతీకగా శ్రీకృష్ణదేవరాయల కాలంతో ముడిపడిన 500 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆలయంలో ఒక వైపు శివాలయం, మరోవైపు నూర్‌షావలి దర్గా ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా శివరాత్రి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శివాలయంలో శివరాత్రి వేడుకలు, శని, ఆదివారాల్లో నూర్‌షావలి దర్గాలో గంధం, ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాలకు పట్టణంతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు దర్గాకు తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


నూర్‌షావలి దర్గా వద్ద భక్తులరద్దీ